


# గుసగుసలు

## జొన్నలగడ్డ లలిత



"అమ్మా" సన్నటి పిలుపు చెవి దగ్గర. పక్కనెవరూ లేరు. ఆ గొంతును గుర్తు పట్టాను. అప్పుడప్పుడు నన్ను పలకరిస్తున్నట్లనిపిస్తుంది.

"నీకివి నచ్చాయా తల్లీ?" అన్నాను ఇండియా శారీహౌస్ లో రెండు పూల చీరెల తానులు చూపించి. వందల కొద్దీ చీరెతానులు, పమిట కొంగులు కనిపిస్తూ, పది డాలర్ల నుంచీ యాభయి వరకు. ఆ రెండు మరి కొంచెం ఆకర్షణీయంగా ఉన్నాయని, వాటి దగ్గర ఆగాను. ఒకటి చాలా అందంగా ఉంది. లేత రోజా మీద సన్నటి నీలం హయసింత్ పూవులు, చిన్ని చిగురాకులు. తాకగానే, వేళ్ళ మధ్య నుంచి జారిపోతున్నది. మరీ పల్చగా ఉంది, వద్దులే అని ముందుకు సాగాను. కానీ, ఏదో ప్రేరేపణతో, మళ్ళీ చేతుల్లోకి తీసుకున్నాను. హయసింత్ సువాసనలు వెదజల్లుతున్నదా చీరె. అంత నిజమనిపిస్తున్నాయా పూలు.

"నేనిది తీసుకుంటాను" అన్నాను సేల్స్ గర్ల్ తో -- యెదలో చిన్న సంతోషభావం! అర్థమయి సన్నగా నవ్వేశాను, ఎవరేమనుకొంటారో అనే భయం లేకుండా.

"నేను కడితే బాగుంటుందా ఈచీరె?" అని మనసులో వేసుకొన్న ప్రశ్నకు, చిన్న జవాబు "బ్రహ్మాండంగా ఉంటుందిలే" అని.

తాను చూస్తే ఆఖరి చీరేమోననిపించింది. ఒక్కోసారి, పమిటంచులేని ఆఖరి చీరె కొంచెం పెద్దదిగా ఉండి, కుచ్చెళ్ళెక్కువగా వస్తాయి కూడా. తాను విప్పుతుంటే, నేను చూచినది పమిటంచనీ, చీరె ఇంకా అందంగా కనిపించింది. అదృష్టమే అనుకొన్నాను మనసులో.

సేల్స్‌గర్ల్ తో, ఒక చీరె తీసుకుంటానన్నాను.

"ఇది చాలా ఖరీదు మేడం. నిజంగానే కొంటారా?" అని అడిగింది. ఆ తానులున్నచోట ధర చూస్తే ముప్పయి డాలర్లని ఉంది. నా సాదా వేషం చూసి అట్లా అనుకొంటున్నదేమో ఈమె అని అనుమానమొచ్చి, అదే అడిగాను.

"సారీ మేడం. పొరపాటున అక్కడ పెట్టారెవరో. ఇది చాలా స్పెషల్‌గా, ఎవరో ఆర్టిస్టు దగ్గర డిజైన్ తీసుకొని నేయించిన చీరె. ఉంటుందిలే అని ఒకటి ఎక్స్ట్రాగా నేశారు. ఇది వంద డాలర్లు" అన్నదా అమ్మాయి.

"అమ్మా, నాకోసం ఎంతో ఖర్చు అయ్యేది కదా? కొనేసెయి, ఏమీ పరవాలేదు. నేనే కాలేజ్ పూర్తి చేసి, ఉద్యోగం చేస్తూ కొనిపెట్టాననుకో. నువ్వు కట్టుకొంటే నీకొక హగ్గిస్తానులే. ఇది మన రహస్యం". ఆ చిన్న గొంతు ఉత్సాహంగా చెప్పింది నాచెవి లో, నా కనుకొలలో తడి చేరుతుంటే. తననెవరు ఇక్కడికి తెచ్చారో అనుకొన్నాను మనసులో.

"కత్తిరించమంటారా" అని మళ్ళీ అడిగిందా అమ్మాయి.

"తీసుకుంటాను, కానీ ఆఖరి చీరేమో కదా?" అన్నాను.

"ఓ మరచి పోయాను. సారీ" అంటూ తానునుంచీ వేరు చేసి మడత పెట్టిచ్చింది. 'నాచిన్న తల్లి నన్నెప్పుడూ సంతోష పెట్టాలని చూస్తుంటుంది. తన గొంతు వినపడనప్పుడు, ఎక్కడికి వెళ్తుందో, ఏమి చేస్తుంటుందో?' నామనసులో ఎన్నో సందేహాలు. చీరెకు డబ్బిచ్చి వీధి లోకి వచ్చాను. శ్రీవారు ఓపికగా కూచొని పేపర్ తిరగేస్తున్నారు కారులో. అంగడిలోకి రావడమెప్పుడూ ఇష్టం లేదాయనకు.

"నచ్చిన చీరె దొరికిందా?" అంటూ ఇంజిన్ స్టార్ట్ చేసి ఇంటికి బయల్దేరారు.

"రేపు చూసి చెప్పురులెండి, మీకు నచ్చిందో లేదోనని". నాచీరెను గుండెలకు హత్తుకున్నాను, చిన్న తల్లెటు వెళ్ళిపోయిందో అనుకొంటూ. వళ్ళంతా వింత గగుర్పొడుపు.

రాత్రి భోజనాల తరువాత, చీరెకు ఫాల్, అంచులు కుట్టుకున్నాను టీవీ చూస్తూ. మనసునిండా ప్రేమ. పక్క రోజు కట్టుకుంటాననే ఉత్సాహంతో హేంగర్‌కి తగిలించి, పడుకొన్నాను.

పక్కరోజు సాయంత్రం, స్నానం చేసి, చీరంచులకు పసుపు కుంకుమలు రాసి కట్టుకొన్నాను.

"అద్భుతం!" అన్నది నాయెదుట నిలువుటద్దం. ఎవరున్నారో అందులో అని నవ్వుకొన్నాను. "భలే అందంగా ఉంది ప్రియా ఈచీరె. పూలమాలికలా ఉన్నావు ఈచీరెలో" అన్నారు శ్రీవారు ప్రేమగా దగ్గరకు తీసుకొంటూ. చీరె ధర చెప్తే ఏమంటారో అని ఒక్క క్షణం సందేహించినా, నవ్వుతూ చెప్పేశాను, "నాలుగు చీరెల డబ్బు ఒక్కదానికే పెట్టేశాను. అందంగా ఉండొద్దామరి?"

"డబ్బుకూ అందానికీ సంబంధం లేదని నువ్వే అంటావుగా ఎప్పుడూ? పెడితే పెట్టావులే. పద రాము వాళ్ళు ఎదురు చూస్తుంటారు", అని కారు వైపు దారితీశారు. కార్లో కూచుని నన్ను నేను హగ్ చేసుకొన్నాను. నాచేతుల్లో ఇమిడేదెవరో తెలుసెప్పుడూ. పెదవులనుండి చిన్న నవ్వు తప్పించుకొని వచ్చింది.

శ్రీవారు తమాషాగా అడిగారు "ఎవరు చక్కిలిగింతలు పెడ్తున్నారోయి నీకు?"

ఆయన కేమని చెప్పేది? చెప్పినా అర్థమవుతుందా? అయినా, ఇది నా అనుభవం. దాచుకుంటాను ప్రస్తుతానికి. ఎవరు హాస్యాలాడకున్నా, నాలో నేను నవ్వుకుంటుంటే, ఇదన్న మాట తనభావం, అనుకుని ఊరుకున్నాను.

పది నిమిషాల్లో కార్లో నుంచి దిగి రాము, పావని వాళ్ళ వాకిట్లోకి నడిచామిద్దరం. వెల్కం హగ్ ఇస్తూ, "అబ్బో! ఎంత అందంగా ఉందీ చీరె!" పావని చెంగు పట్టుకొని, మెత్తదనానికి మురిసిపోయింది. ఒక అడుగు వెనక్కు వేసి, ఆశ్చర్యంగా నా మొహం వయిపు చూసింది. "ప్రియా--" ప్రశ్నించాయామె కళ్ళు, కానీ నోట మాట రాలేదు. నాకర్థమయిందామె ప్రశ్న, కానీ నా నోట జవాబు రాలేదు -- మాటలకందనిదీ భావం.

ఇద్దరం వంటింట్లోకి వెళ్ళిన తరువాత మళ్ళీ అడిగింది, "ప్రియా, బయటేమయింది నీకు?"

"నీకేమనిపించింది?" నాచిన్న తల్లి నాదగ్గర ఉన్నప్పుడు, పక్కనున్నవాళ్ళకేమనిపిస్తుందో తెలుసుకోవాలి నేను కూడా.

"నిన్ను హగ్ చేసినప్పుడు, మనిద్దరి హృదయాల మధ్య ప్రేమ ప్రవహించినట్లనిపించింది. ఈరోజేమయినా అద్భుతం జరిగిందా నీ జీవితంలో?"

ముసిముసి నవ్వులు, గిలిగింతలు, మళ్ళీ.

"మీవారికి తెలుసా ఈరహస్యం?"

"ఏ రహస్యం?"

"అదే నీ నవ్య ప్రేమికుడి గురించి-- నాదగ్గరేదో దాస్తున్నావు. నేనెవరికీ చెప్పనులే. మనం ఇప్పటికి ఇరవయియేండ్ల నుండి స్నేహితులం కదా? మన మధ్య రహస్యాలెందుకు? పోనీ ఒక చిన్న మాటయినా చెప్పు. ఎప్పుడు, ఎక్కడ కలిశావితన్ని?"

"యెవరిని?" అనడిగా అమాయకంగా. మళ్ళీ గిలిగింతలు, పులకింతలు, నవ్వులు.

"మనిద్దరం దేని గురంచయినా మాట్లాడుకోవచ్చనుకొన్నాం కదా ఎప్పుడో?-- ఒక్క పడకగది విషయాలు తప్ప?" నేనేమీ చెప్పడంలేదని పావని లో కొంచెం అసహనం మొదలయింది.

"పెండ్లయిన సంవత్సరం లోపే---" అన్నాను, ప్రేమగా ఆరోజు గుర్తుతెచ్చుకొంటూ.

చిలిపిగా కన్నుకొట్టింది పావని, "ఓహో" అన్నట్లు.

రెండు ప్లేట్లలో వేడివేడి సమోసాలు, తియ్యటి చింతపండు పచ్చడి, కొత్తిమీర కారం పెట్టి, హాల్లోకి దారి తీసింది. నాకొక చిన్న అనుమానమొచ్చింది. చిన్నతల్లి, చీరెలు, పూవులూ చూడగలిగినట్లే, పిండివంటల వాసనలు, రుచులు కూడా చూడగలదా అని.

డైనింగ్ రూంలో రెండు గంటల పాటు తీరిగ్గా రకరకాల కూరలు, పచ్చళ్ళు, పులుసులూ, పెరుగూ తిని, భుక్తాయాసంతో

లేచాము టేబుల్ దగ్గరనుంచి. ఎన్నో కబుర్లు-- ఏవేవో ప్లానులు. అప్పుడప్పుడు నేను పరధ్యాన్నంగా ఉన్నానని చూసి,యేవో అర్ధం చేసుకొంది పావని. నేను నా లోకంలో ఉన్నాను కొంచెం సేపు. శ్రీవారు ఒకటి రెండు సార్లేమిటీ కథ అన్నట్లు చూసి ఊరుకున్నారు. 'మీరు దిగులు పడవల్సిన విషయమేమీలేదులే' అన్నాను కళ్ళతో. వంటింట్లోకి వెళ్ళామందరం ఖాళీ గిన్నెలన్నీ తీసుకుని. మగ వాళ్ళిద్దరూ గిన్నెలు కడుగుతామంటే, నేను పావని హాల్లోకొచ్చేశాము.

కిటికీ దగ్గరున్న సోఫాలో కూచుని ఇంటి వెనక తోటను చూస్తున్నాను నేను.

"రేపు పొద్దున ఫోన్ చేసి అడగాలనుకొన్నాను కానీ, ఇక కుతూహలమాపుకోలేను. అతనెవరో చెప్పు" అడిగింది పావని.

"అతను కాదు---"

"ఓమ్మై--- ఆమె? ఆ ప్రేమా?"

"యేం? కాకూడదా? ఈరోజుల్లో ఎవరితోనయినా రొమాన్స్ ఒకే కదా?" లోలోన నవ్వుతూ అడిగాను.

"నిన్ను జడ్జ్ చేయటం లేదు-- కానీ, నువ్వు ఆ దారిలో వెళ్తావని అనుకోలేదు--అంతే" పావని సమాధానపరచింది. మళ్ళీ ప్రశ్నలు మొదలు పెట్టింది.

"ఎవరామె? ఇన్నాళ్ళు మీవారి నుండి ఈ రహస్యమెలా దాచగలిగావు? ఇప్పుడేమయింది? ఆమె మళ్ళీ నీజీవితంలోకెలా వచ్చింది? మీవారికి ఎలాంటి అనుమానమూ రాలేదా?"

చిన్న తల్లి కూడా ఈ తమాషాను చూస్తూ నవ్వుతున్నట్లనిపించింది. ప్రేమ రహస్యాలు, అన్నిటికంటే అందమయినవి కదా?

"పావనీ, రేపు చెప్తానులే అంతా. ముందు నామనసులోనే అన్ని విషయాలు పొందిక చేసుకోవాలి. ఇంకా చేత కావటం లేదు మరి" అని ఆగిపోయాను. పావనికి నిరాశనిపించి నిట్టూర్పు వదిలింది. "నేను కొంచెంసేపు మీ తోట చూసి వస్తాను, చాలా పూలు కనిపిస్తున్నాయి" అని ఇంటి వెనక్కు నడిచాను. పావని అర్ధం చేసుకొని, "గిన్నెలెంత తళ తళ లాడుతున్నాయో చూసివస్తానులే నేను" అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

పావని మంచి తోట పెంచింది. ఎన్ని రోజా మొక్కలో! సాగిపోయే సంధ్యా కాంతిలో, వందలకొద్దీ రోజా పూలు తలలాడిస్తున్నాయందంగా. అత్తర్లు చల్లినట్లు, తోటంతా మధురంగా ఉంది. ఒక పూవు కోసి, జడలో తురుము కొన్నాను.

"బాగుంది" అని గుసగుస.

"చిన్నతల్లీ, ఎందుకు నాచుట్టూ ఇలా తిరుగుతున్నావీ మధ్య?" అడిగాను ప్రేమగా.

"ఈరోజే తేదీ అని గుర్తుందా అమ్మా?" పశ్చాత్తాపంతో నా మొహం కృంగిపోయింది. ఈయేడాది గుర్తు కూడా లేక పోయిందే అని.

"క్షమించు తల్లీ" అన్నాను కళ్ళల్లో నీళ్ళు చిప్పిలుతుంటే.

"అమ్మా, ప్రతి యేడాది నా పుట్టినరోజున ఇలా బాధ పడ్తుంటావు. అందుకే ఈ నిశ్చయం. ఈ సంవత్సరం నా పుట్టినరోజున నువ్వు సంతోషంగా ఉండాలనిపించింది. డానా ఆంటీ మూడు నెలల్రకితం నాగురించేమి చెప్పింది? నా ఆత్మ నీ చుట్టూ సంతోషంగా తిరుగుతున్నదని, నేను చనిపోయాననే బాధ నీకెప్పుడూ వద్దనీ, నాదేవతా రూపాన్ని,"ఇదుగో నీ ఏంజల్" అని నీకప్పగించింది కదా?" ఆ సంఘటన గుర్తు వచ్చి వణికిపోయాను.

"ఇక ముందు నేను నీతోనే ఉంటాను. ఒక దుఃఖపు గాధలా మిగిలిపోను. నీతో అందమయినవన్నీ అనుభవించాలని ఉందమ్మా. నాతో డాన్స్ చేస్తావా?"

ఉక్కిరిబిక్కిరిగా నవ్వటం మొదలుపెట్టాను. ఇంత బాధలోకూడా ఈ చిన్నతల్లి నవ్వించేస్తున్నది.

"దా అమ్మా. చేతులు పట్టుకో"

నా చేతులు తన చేతుల్లోకి లాక్కున్నట్లనిపించింది. నేను నిర్లిప్తంగా, చనిపోయిందని ఎక్కడో మారుమూల మనసులో తోసి పెట్టుకున్న చిన్న పాప కాదీ మాటలనడం. యెదిగిన స్త్రీ చేతులివి. ఓహో--ఆ చిన్న పాపిప్పుడు ఇరవయి దాటిన యువతి--- అత్యంతందమయిన వయసు-- డాన్స్ చేయడానికి, నవ్వుకోవడానికి, ప్రేమించడానికి! చిన్నతల్లి మళ్ళీ వచ్చింది, నాబాధను కడిగేయడానికి. మూడురోజుల పసికందుగా తను

వెళ్ళిపోయిందనే నాబాధను మరిపించడానికి, ఒక యువతిగా, నాతో సంతోషాన్ని పంచుకోవడానికి వచ్చింది. మార్దవత, స్నేహం, ఆనందం, అన్నీ పంచుకొని నాగుండెలు సంతోషంతో నింపడానికి వచ్చిందీ చిన్నతల్లి.

శరీరమంతా జలదరించింది రకరకాల భావాలతో. వెచ్చని సాయంత్రమయినా, జిల్లున వణికిపోయాను.

రాత్రి పసిపాప గిలిగింతలు గుర్తొచ్చాయి. ఇప్పుడీ యువతి కనిపించింది. పావని అడిగిన ఆమే ఈమే అని నవ్వుకున్నాను. చెవులనిండా నవ్వుల సవ్వడి-- మొహమంతా ప్రేమ వెలుగు -- గుండెంతా అదే ఆత్మనిండా ఆనందం!

ఆమె చేతులు పట్టుకొన్నాను. కనిపించని బంధాలివి --- ఇద్దరం రంగుల రాట్నంలా గిరగిర తిరగటం మొదలుపెట్టాము. ఆనంద భాష్పాలు జలజలరాలాయి. మళ్ళీ మళ్ళీ తిరగటమే తిరగటం! "చిన్నతల్లీ, ఎప్పుడూ ఇలాగే ఆడుకుందాం. ఇక కన్నీళ్ళొద్దు నువ్వన్నట్లు. దుఃఖం వద్దు. ప్రేమ తప్ప మరేమీ వద్దు" గాలిలోకి సన్నగా నా ప్రమాణాలన్నీ చెప్పేశాను, తిరుగుతూనే. ఆ సంధ్యలో ఆ యువతి గొంతునుండి కూడా నవ్వులు మారుమోగాయి, నాకొక్కదానికే వినిపించినా. కిటికీలోనుంచీ ముగ్గురు వ్యక్తులు నన్ను చూస్తూ నిలుచున్నారు, విడ్డూరమేమిటని అర్థం కాకుండా. కానీ మా సంతోషం మటుకు వాళ్ళను కూడ అంటిందనే అనిపించింది నా మనసులో.



విశాఖపట్నంలో ఎం.ఎస్. పూర్తయాక, పెళ్ళిచేసుకుని 1970లో అమెరికా వచ్చారు. శ్రీవారు ప్రసాద్ గారు, సివిల్ ఇంజినీరు. వీరికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. ఇద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. చిన్నప్పటినుంచీ పుస్తకాలు చదవడమంటే అమితమైన ఆసక్తి. రచనా వ్యాసంగంలోకి అడుగు పెట్టింది మాత్రం 8 సంవత్సరాల క్రిందటే. నాన్న గారి సాన్నిహిత్యంనుంచీ అధ్యాత్మికతత్వం, అమ్మవద్దనుంచీ సాహిత్యసౌరభం పరిచయమయ్యాయి. హిందుత్వాన్ని అభిమానించే అమెరికన్ మిత్రులు చాలామందితో మన సాహితీ సంస్కృతులగురించి చర్చించడం ఒక హాబీ..!

## సరదా.. సరదాగా..!

*"నేను ఒక వేళ నీ ప్రేమని తిరస్కరిస్తే నిజంగా ఆత్మహత్య చేసుకుంటావా మోహన్?" జాలిగా అడిగింది రాధ.*

*"అవును రాధా! సాధారణంగా అలాగే చేస్తుంటాను!" దిగులుగా అన్నాడు మోహన్.*

*"రాధా! నన్ను కాదంటే- నేను చచ్చిపోతాను!" అన్నాడు వేణు.*

*రాధ వెంటనే "కాదు" అనేసింది.*

*వేణు చచ్చిపోయాడు, మరో అరవై ఏళ్ళ తరువాత!*

*"ప్రియా ! నేను గాలిలోకి తేలిపోయేలా ముచ్చటగా మూడు మాటలు మాట్లాడవూ?"*

*"వెళ్ళి ఉరి వేసుకో!"*

*"నువ్వు గీసిన చిత్రాలు చూసి విపరీతంగా ఆశ్చర్యపోతుంటాను!"*

*"ఎందుకు? ఎలా గీశానా అనేనా?"*

*"అబ్బే! ఎందుగ్గీస్తున్నావా అని!"*

యర్రంశెట్టి శాయి